సాక్షి
నిజామాబాద్

శనివారం । 18 । మే । 2024



ఊపందుకున్న ఖరీఫ్ పనులు
వాతావరణం చల్లబడడంతో బోధన్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో ఖరీఫ్ పనులు ఊపందుకున్నాయి.
- 8లో ▸



ఆయాల నియామకమెన్నడో?
ఆయాల నియామకానికి చర్యలు తీసుకోకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
38.8/22.9

వాతావరణం
ఆకాశం మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురియవచ్చు.

న్యూస్‌రీల్

జూనియర్ డాక్టర్ ఆత్మహత్యాయత్నం?

నిజామాబాద్‌నాగారం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా జూనియర్ డాక్టర్ ఒకరు ఆత్మహత్యాయత్నం చేసినట్లు వైద్యవర్గాల్లో చర్చ సాగుతోంది. రెండు రోజుల క్రితం ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. కుటుంబ కలహాల కారణంగా జూనియర్ డాక్టర్ రెండు నిద్రమాత్రలు మింగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా, అదే రూములోని మిగతా జూనియర్ డాక్టర్లు గమనించి ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారని చెబుతున్నారు. ఇదివరకే మెడికల్ కళాశాలలో చోటుచేసుకున్న ఆత్మహత్య ఘటనలను మరువకముందే మరో జూనియర్ డాక్టర్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు చర్చ సాగడం కలకలం రేపుతోంది. ఈ ఘటనపై అధికారులు మౌనంగా ఉండడం అనుమానాలకు తావిస్తోంది.

21 నుంచి డిగ్రీ పరీక్షలు



తెయూ(డిచ్‌పల్లి): ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న డిగ్రీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎం.యాదగిరి అన్నారు. పరీక్ష కేంద్రాల్లో చీఫ్ సూపరింటెండెంట్లు(సీఎస్)గా వ్యవహరించే వారు పేపర్ డౌన్‌లోడ్ చేసే సమయానికి విధిగా సెంటర్లలో ఉండాలని ఆదేశించారు. అకడమిక్ ఆడిట్ సెల్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెట్లతో క్యాంపస్‌లో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. వర్సిటీ పరిధిలో ఉమ్మడి జిల్లాలోని 38 సెంటర్లలో జూన్ 15వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విధుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, అత్యవసరమైతే సెంటర్‌లో పనిచేస్తున్న మరో అధికారికి లిఖితపూర్వకంగా బాధ్యతలు అప్పగించాలని సీఎస్‌లకు రిజిస్ట్రార్ సూచించారు. డిగ్రీ 2, 4, 6 సెమిస్టర్స్ రెగ్యులర్ పరీక్షలకు సుమారు 24 వేల మంది, 1, 3, 5 సెమిస్టర్స్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు సుమారు 14 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. ముందస్తు సమాచారం ఉన్నప్పటికీ పలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు సమావేశానికి గైర్హాజరు కావడంపై రిజిస్ట్రార్ అసహనం వ్యక్తం చేశారు. గైర్హాజరైన ప్రిన్సిపాళ్ల నుంచి వివరణ తీసుకోవాలని ఆడిట్‌సెల్ అధికారులకు సూచించారు. సమావేశంలో పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎం.అరుణ, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ అతిక్ సుల్తాన్ ఘోరీ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా చంద్రశేఖర్

కామారెడ్డి టౌన్ : జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా డిప్యూటీ డీఎంహెచ్‌వో చంద్రశేఖర్‌ను నియమిస్తూ రాష్ట్ర ప్రజారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ శుక్రవారం ఉత్తర్వులను జారీ చేశారు. డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ సెలవులపై వెళ్లడంతో ఆయనకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. శుక్రవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. గతంలో కూడా చంద్రశేఖర్ రెండేళ్ల పాటు ఇన్‌చార్జిగా వ్యవహరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్ : ఉన్నత విద్య అభ్యసించే గిరిజన విద్యార్థులు నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కోసం ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. అర్హత, ఆసక్తిగల గిరిజన విద్యార్థులు ఓవర్సీస్ ట్రైబల్ వెబ్‌సైట్‌లో లేదా కలెక్టరేట్‌లోని శాఖ కార్యాలయంలో పూర్తి వివరాలను పొందవచ్చని ప్రకటనలో పేర్కొన్నారు.

■ గతేడాది నిజామాబాద్ నగరానికి చెందిన యువతి హైదరాబాద్‌లో పని చేస్తున్న క్రమంలో ఓ యువకుడిని ప్రేమించింది. కుటుంబ సభ్యులను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆరు నెలలపాటు సజావుగా సాగిన సంసారం ఇద్దరి మధ్య వచ్చిన మనస్పర్థలకు కోర్టు తలుపులు తట్టారు. కోర్టు ఇరువురి అంగీకారం మేరకు విడాకులు మంజూరు చేసింది.

■ ఆర్మూర్ ప్రాంతానికి చెందిన యువతికి, నగరానికి చెందిన యువకుడితో కుటుంబ సభ్యులు వివాహం జరిపించారు. వీరికి ఒక పాప ఉంది. భార్యభర్తల మధ్య మనస్పర్థలతో విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కారు.



విడాకులకు ప్రధాన కారణాలు

- సర్దుకుపోయే మనస్తత్వం లేకపోవడం
- వివాహేతర సంబంధాలు
- ఉద్యోగం చేసే భార్యాభర్తల్లో ఇగో ప్రాబ్లమ్
- ఆడంబరాలకు పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడటం.
- భార్యాభర్తల మధ్య కుటుంబ సభ్యుల జోక్యం.. దంపతులకు బంధాల విలువ తెలియచెప్పకపోవడం.

వివాహ బంధంలో విడాకుల చిచ్చు

- చిన్నపాటి మనస్పర్థలకే దూరమవుతున్నారు
- పోలీస్‌స్టేషన్లు, కోర్టుకు వెళ్తున్న జంటలు
- ఏటా పెరుగుతున్న కేసులు
- ఇద్దరి మధ్య ఇగో ఓ కారణమే..!

ఖలీల్‌వాడి: వివాహం.. వేద మంత్రాల సాక్షిగా ఇద్దరిని కలిపే గొప్ప సంస్కృతి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల మధ్య వివాహ బంధంతో ఒక్కటయ్యే దంపతులు జీవితాంతం కష్టసుఖాల్లో ఒక్కరికొకరు తోడునీడగా ఉంటూ జీవన ప్రయాణం సాగించాలి. అన్యోన్యంగా ఉండాల్సిన దంపతులు నేటి కాలంలో చిన్న పాటి మనస్పర్థలతోనే విడిపోతున్నారు. కేసుల నమోదుకు పోలీసు స్టేషన్లు, విడాకుల కోసం కోర్టు మెట్లు ఎక్కుతున్నారు.

■ వివాహమైన రోజులు, నెలలు, ఏడాదిలోపే నవ దంపతులు విడిపోతున్నారు. ఆర్నెళ్లు, ఏడాదిలోపు పిల్లలున్న కొత్త దంపతులు మనస్పర్థలతో విడాకులు కావాలంటున్నారు. ఇటువంటి కేసుల్లో అత్యధికులు విద్యావంతులే ఉంటున్నారని న్యాయవాదులు చెబుతున్నారు. వివాహ బంధం మూన్నాళ్ల ముచ్చటగా మారుతోంది.

■ కొన్ని కేసుల్లో కొత్త దంపతుల మధ్య మనస్పర్థలకు ఇరువురి కుటుంబ సభ్యులూ కారణమవుతున్నారని చెబుతున్నారు. ఇద్దరికీ సర్ది చెప్పాల్సిన కుటుంబ సభ్యులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడం లేదంటున్నారు.

■ ప్రస్తుత సమాజంలో స్త్రీలూ అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. భర్తలతో సమానంగా సంపాదిస్తూ కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు. ఇటువంటి కుటుంబాల్లో ఎక్కువగా ఇగో ప్రాబ్లమ్స్‌తో భార్యభర్తల మధ్యస్పర్థలు వచ్చి దూరమవుతున్నారని ఫ్యామిలీ కౌన్సెలర్లు చెబుతున్నారు.

నిజామాబాద్ ఫ్యామిలీ కోర్టు, పోలీస్ స్టేషన్లలో విడాకుల కేసులు నమోదవుతున్నాయి.

ఐదు నెలల్లో 65 కేసులు..

జిల్లాలో భార్యాభర్తల మధ్య వివాదాలు తలెత్తితే ఎక్కువ శాతం మంది స్థానిక పోలీస్ స్టేషన్లకు, నిజామాబాద్‌లోని మహిళా పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నారు. పోలీసులు ఎక్కువ శాతం భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి కలిపే ప్రయత్నం చేస్తున్నారు. మహిళా పోలీస్‌స్టేషన్‌కు జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి వస్తుంటారు. సఖీ కేంద్రం ద్వారా భార్యాభర్తల మధ్య కౌన్సెలింగ్ ద్వారా రాజీ కుదుర్చుతున్నారు. కౌన్సెలింగ్‌లో ఇద్దరి మధ్య అవగాహన కలిగితే అంగీకార పత్రం రాసుకుని కాపురానికి వెళ్తున్న ఘటనలు ఉన్నాయి. పోలీసులు, సఖీ కేంద్రం వారి కౌన్సెలింగ్‌లోనూ మనస్పర్థలు వీడని కొందరు విడాకుల కోసం కోర్టు మెట్లెక్కుతున్నారు.

■ నిజామాబాద్ ఫ్యామిలీ కోర్టుకు 2023లో 151, 2024లో 65 విడాకుల కేసులు వచ్చాయి.

■ నిజామాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో 2023లో 543 ఫిర్యాదులు రాగా, 71 కేసులు నమోదయ్యాయి. 2024లో మే 17 వరకు 144 ఫిర్యాదులు రాగా, 20 కేసులు నమోదు అయ్యాయి. మిగతా కేసుల్లో పోలీసుల కౌన్సెలింగ్‌లో భార్యాభర్తలు ఒక్కటయ్యారు.

ఓపిక ఉండాలి

భార్యాభర్తల మధ్య గొడవలు వచ్చినప్పుడు ఓపికగా ఉండాలి. తల్లిదండ్రులు బంధాల విలువ ఇద్దరికీ చెప్పాలి. ఆవేశానికి పోయి సంసారం నాశనం చేసుకోవద్దు. భార్యభర్తల మధ్య గొడవలతో మా వద్దకు వచ్చిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం. ఇద్దరి మధ్య అవగాహన కుదరకపోతే కేసులు నమోదు చేస్తున్నాం.

– శ్రీలత, సీఐ, మహిళా పోలీస్ స్టేషన్, నిజామాబాద్

మత్తు ఆదాయం

- 78 రోజుల్లో 6లక్షల కేసుల బీర్ల విక్రయాలు
- ఓ వైపు భానుడి ప్రతాపం.. మరో వైపు పెళ్లిళ్ల సీజన్
- లిక్కర్ అమ్మకాలూ అధికమే..



ఖలీల్‌వాడి: ఎండ తీవ్రత ఓ వైపు.. మరో వైపు పెళ్లిళ్ల సీజన్ కావడంతో బీర్ల విక్రయాలు జిల్లాలో జోరుగా సాగాయి. మార్చి నుంచి రోజుకు వేలాది కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. జిల్లాలో 102 వైన్ షాపులు, 17 బార్లు ఉన్నాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎక్కువ మొత్తంలో బీర్లు అమ్ముడైనట్లు ఎక్సైజ్ అధికారులు చెబుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఒక్కో రోజు సుమారు 8వేల కేసుల బీర్లు అమ్ముడుపోయాయి. గత వారం రోజులుగా వాతావరణం చల్లబడడంతో బీర్ల విక్రయాల జోరు కొంత మేర తగ్గింది. పార్లమెంట్ పోలింగ్ నేపథ్యంలో రెండు రోజులపాటు వైన్ షాపులు మూసి ఉంచడంతో మద్యం ప్రియులు 'స్టాక్' నిల్వ చేసుకున్నారు. దీంతో లైట్ బీర్ల కొరత ఏర్పడడంతో స్ట్రాంగ్ బీర్లను విక్రయించారు. రెండు రోజులుగా వైన్ షాపులలో లైట్ బీర్లు మద్యం ప్రియులకు అంబాటులోకి వచ్చాయి. ఈనెల 17వ తేదీ వరకు 69వేల కేసుల బీర్లు అమ్ముడయ్యాయి.

జిల్లాలోని వైన్ షాపులలో మద్యం విక్రయాలు

నెల	లిక్కర్ (లక్షల కేసులు)	బీర్లు (లక్షల కేసులు)	ఆదాయం (రూ.కోట్లలో..)
మార్చి	1.16	2.72	139
ఏప్రిల్	1.35	2.66	143
మే	1.06	69 వేల కేసులు	68

నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చిన ఆమ్‌చూర్



రికార్డు స్థాయిలో ఆమ్‌చూర్ ధర

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఆమ్‌చూర్ ధర ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో శుక్రవారం క్వింటాలుకు రూ.32,100 పలికింది. మామిడిపూత తక్కువగా ఉండడంతో ఈ ధర పలుకుతోందని రైతులు చెబుతున్నారు. తెలంగాణలో హైదరాబాద్ తర్వాత నిజామాబాద్‌లోనే ఆమ్‌చూర్ కొనుగోళ్లు జరుగుతాయి. మార్కెట్ యార్డుకు మహబూబ్‌నగర్, నల్గొండ, కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, సిద్దిపేట, సిరిసిల్ల, మెదక్, సంగారెడ్డి, కర్ణాటక రాష్ట్రంలోని బీదర్ నుంచి మొత్తం 420 క్వింటాళ్ల ఆమ్‌చూర్ నిజామాబాద్ మార్కెట్‌కు వచ్చింది. ఉత్తర భారతదేశంలో ఇతర రాష్ట్రాల్లో చింతపండుకు బదులుగా పులుపుకోసం ఆమ్‌చూర్‌ను వాడుతారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్– నిజామాబాద్

ఓటు వేసేందుకు వచ్చి మృత్యు ఒడికి..

- కుమారుడితో సహా తల్లిదండ్రులు మృతి
- సంగారెడ్డి జిల్లా రాంసానిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం
- పెద్దతడ్గూర్‌లో విషాదఛాయలు



మృతి చెందిన శ్రీనివాస్, సునీత, నాగేశ్ (ఫైల్)

మద్నూర్(జుక్కల్)/వట్‌పల్లి(అందోల్) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఓటు వేయడానికి వచ్చి.. తిరుగు ప్రయాణంలో కుమారుడితో సహా దంపతులు మృతి చెందారు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా అందోలు మండలం రాంసానిపల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మద్నూర్ మండం పెద్దతడ్గూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్(35), సునీత(30) దంపతులు. వీరికి నగేశ్ (7), యువరాజ్ కుమారులు ఉన్నారు. వీరు ఆరేళ్ల క్రితం ఉపాధి కోసం హైదరాబాద్‌లోని బాచుపల్లికి వలస వెళ్లారు. అక్కడ ప్రైవేట్ కంపెనీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఓటు వేసేందుకు ఈ నెల 12న స్వగ్రామానికి వచ్చారు. శుక్రవారం ఉదయం శ్రీనివాస్ పెద్ద కొడుకు యువరాజ్‌ను మహారాష్ట్రలోని అమ్మమ్మ ఇంటికి పంపించారు. సాయంత్రం శ్రీనివాస్ తన బైక్‌పై భార్య సునీత, చిన్న కొడుకు నగేశ్‌తో కలిసి బైక్‌పై హైదరాబాద్ బయలుదేరాడు. అందోలు మండలం రాంసానిపల్లి వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొట్టడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శ్రీనివాస్, సునీతను ఆటోలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోగా, ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న నగేశ్ అనే బాలుడిని పోలీసు వాహనంలో తరలిస్తుండగా అన్నాసాగర్ దాటగానే కన్నుమూశాడు. ఒకేసారి ముగ్గురు కుటుంబ సభ్యులు మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



పెద్దతడ్గూర్‌లో రోదిస్తున్న శ్రీనివాస్ తల్లి రాంబాయి

గడువులోగా పనులు పూర్తి చేయాలి

- ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక నదుపాయాల మెరుగుదలపై దృష్టి
- వీడియోకాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, ఇతర అధికారులు

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను స్కూళ్ల పునఃప్రారంభానికి ముందే పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులతోపాటు ధరణి దరఖాస్తులు, ప్రజావాణి, ధాన్యం కొనుగోళ్లు, సీఎంఆర్ లక్ష్య సాధన తదితర అంశాలపై శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శాంతికుమారి సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో పనుల గ్రౌండింగ్ పూర్తి చేయాలన్నారు. ఆయా పాఠశాలల్లో వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను క్రమం తప్పకుండా పరిశీలిస్తూ, పనుల్లో నాణ్యతపాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బాలికలు ఉండే ప్రతి బడిలో తప్పనిసరిగా టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'మన ఊరు - మన బడి' కింద ఇప్పటికే ప్రారంభించి వివిధ దశల్లో ఉన్న పనులను సైతం పూర్తి చేయించాలన్నారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు అందించాలని, ఇప్పటికే యూనిఫామ్ క్లాత్‌ను సరఫరా చేశామన్నారు.

ధరణి, ప్రజావాణిపై..

ధరణి పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని సీఎస్ సూచించారు. ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్ష ఏర్పాటు చేసి ఈ నెలాఖరులోగా వందకు వంద శాతం సమస్యలను పరిష్కరించాలన్నారు. రాష్ట్ర స్థాయి ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబంధిత జిల్లాలకు పంపించడం జరుగుతోందని, వెంటవెంటనే పరిష్కరించాలన్నారు. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణిని తాత్కాలికంగా నిలిపివేశామని, కోడ్ ముగిసిన వెంటనే యథావిధిగా కొనసాగుతుందని అన్నారు. ప్రజావాణి పునఃప్రారంభమయ్యే లోగా పెండింగ్ అర్జీలను పరిష్కరిస్తూ, దరఖాస్తుదారులకు లిఖిత పూర్వకంగా తెలుపాలని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లపై..

కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణను వేగవంతం చేస్తూ, వెంటవెంటనే రైస్ మిల్లులకు తరలించాలని అధికారులను సీఎస్ ఆదేశించారు. మిల్లులు పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు మిల్లింగ్ జరిపేలా పర్యవేక్షించాలని, సీఎంఆర్ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. ధాన్యం సేకరణ, రైస్ మిల్లులకు తరలింపునకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని వివరించారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పార్లమెంటు ఎన్నికల పోలింగ్ ప్రక్రియను శాంతియుత వాతావరణంలో, సజావుగా నిర్వహించడంపై కలెక్టర్లను సీఎస్ అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్ కుమార్, డీఆర్డీవో సాయాగౌడ్, డీఎస్‌వో చంద్రప్రకాశ్, సివిల్ సప్లయీస్ డీఎం జగదీశ్, డీఈవో దుర్గాప్రసాద్, డీసీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఆకాశంలో సప్తవర్ణ సోయగం

సప్తవర్ణాల సోయగం సిరికొండ మండలంలో కనువిందు చేసింది. శుక్రవారం సాయంత్రం ఏర్పడిన ఇంద్ర ధనుస్సు మండల కేంద్రంతోపాటు ముషీర్‌నగర తదితర గ్రామాల్లో కనిపించింది. ఎండ కాస్తుండగా చిరు జల్లులు కురిసి ఆకాశంలో ఇంద్రధనుస్సు ఏర్పడింది. ఈ దృశ్యం కనులవిందు చేసింది. చిన్నారులు కేరింతలు కొడుతూ ఉల్లాసంగా గడిపారు.

– సిరికొండ

రంగంలోకి ఉన్నతాధికారులు

- జిల్లా వ్యాప్తంగా 792 పాఠశాలలు..
- అమ్మ ఆదర్శ కమిటీల పర్యవేక్షణలో రూ.31.08 కోట్లతో పనులు

మోర్తాడ్(బాల్కొండ): అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పాఠశాలకు గతంలో మంజూరు చేసి చేపట్టిన పనులు ఎంత వరకు వచ్చాయనే అంశంపై అధికార యంత్రాంగం దృష్టి సారించింది. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనను అధికారులు సమీక్షిస్తున్నారు. 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండకుండా ఉన్నతాధికారులు స్వయంగా రంగంలోకి దిగారు. ఇందులో భాగంగా అదనపు కలెక్టర్ అంకిత్ కమ్మర్ పల్లి, భీమ్‌గల్ మండలాల్లోని పలు పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను శుక్రవారం పరిశీలించా రు. జిల్లా వ్యాప్తంగా 792 పాఠశాలల్లో రూ.31.08 కోట్లతో పనులను ప్రారంభించగా, అమ్మ ఆదర్శ పాఠశాలల పనుల బాధ్యతలను మహిళా సమాఖ్యలకే ప్రభుత్వం అప్పగించింది. మహిళా సంఘాల ప్రతినిధులు సూచించిన వ్యక్తులే పనులు చేపట్టాల్సి ఉంది. కొన్ని చోట్ల స్థానిక రాజకీయ నాయకుల జోక్యంతో పనులు తమకు ఇష్టం వచ్చిన కాంట్రాక్టర్లకు అప్పగించారు. పనులు ఎవరు చేసినా మహిళా సంఘాల ద్వారానే బిల్లులను చెల్లించాల్సి ఉంది. ఏదిఏమైనప్పటికీ పనుల్లో వేగం పుంజుకోవాలనే ఉద్దేశంతో అధికారులు నిత్యం సమీక్షిస్తున్నారు.

క్లుప్తంగా

ఆర్థిక సాయం కోసం దరఖాస్తుల ఆహ్వానం



నిజామాబాద్‌అర్బన్‌: ముథూట్‌ ఫైనాన్స్‌ సంస్థ వివిధ వర్గాల నుంచి ఆర్థిక సహాయం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు రీజినల్‌ మేనేజర్‌ కె. ఉపేందర్‌ శుక్రవారం తెలిపారు. బీటెక్‌, బీఎస్సీ నర్సింగ్‌, ఇతర ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు ఎవరైనా మెరిట్‌ స్కాలర్‌షిప్‌ కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని చెప్పారు. వితంతు, పెన్షన్లు, ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం, జీవనాధారం లేనివారికి, డయాలసిస్‌ పేషెంట్లుకు , తల్లి లేదా తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు , పేద కుటుంబాల అమ్మాయిల వివాహానికి ఆర్థిక సాయం చేయనున్నామన్నారు. ఆర్థిక సాయం కోసం 9912085654ను సంప్రదించవచ్చని, మెరిట్‌ స్కాలర్‌షిప్‌ల కోసం CSRHYD@MUTHOOTGROUP. COM ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

మెరిట్‌ స్కాలర్‌షిప్‌ అందజేత

హైదరాబాద్‌ వీఎస్‌ఆర్‌ వీజీటీ కాలేజీలో బీటెక్‌ మూడో సంవత్సరం చదువుతున్న సంతోష్‌కుమార్‌కు రూ.30 వేల మెరిట్‌ స్కాలర్‌షిప్‌ అందజేసినట్లు రీజినల్‌ మేనేజర్‌ ఉపేందర్‌ తెలిపారు. ముథూట్‌ ఫైనాన్స్‌ సిబ్బంది వెంకటేశ్‌, కృష్ణ, కాశీవరప్రసాద్‌ ఇతరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి

ఎల్లారెడ్డి : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్‌ చంద్రమోహన్‌ అన్నారు. శుక్రవారం ఎల్లారెడ్డి మండలంలోని కల్యాణి, లింగారెడ్డిపేట గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ధాన్యం కొనగోలు వేగవంతం చేసి ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విశ్వనాథం తదితరులు ఉన్నారు.

లారీల కోసం రోడ్డెక్కిన అధికారులు



నిజాంసాగర్‌(జుక్కల్‌) : మహమ్మద్‌ నగర్‌ మండలంలోని బొగ్గు గుడిసె చౌరస్తా వద్ద శుక్రవారం లారీల కోసం ఏఎంవీఐ విక్రాంత్‌, తహసీల్దార్‌ క్రాంతికుమార్‌ రోడ్డుపై వెళ్తున్న లారీలను ఆపారు. గున్కుల్‌, అచ్చంపేట, మల్లూర్‌ సొసైటీల పరిధిలోని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం బస్తాల తరలింపునకు లారీల కొరత ఉంది. ఈ విషయాన్ని స్థానిక రైతులు జుక్కల్‌ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే జిల్లా, రాష్ట్ర ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. దాంతో మోటార్‌ వెహికిల్‌ ఇన్‌స్పెక్టర్‌తోపాటు తహసీల్దార్‌, రైతులు కలిసి లారీలను ఆపుతూ కొనుగోలు కేంద్రాలకు తరలించారు. ధాన్యం బస్తాల తరలింపునకు లారీలు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన డీసీసీబీ చైర్మన్‌



సుభాష్‌నగర్‌: రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావును డీసీసీబీ చైర్మన్‌ కుంట రమేష్‌ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. రుణమాఫీ ప్రక్రియను త్వరగా చేపట్టి పూర్తి చేయాలని ఈ సందర్భంగా కోరారు.

ఆయాల నియామకమెప్పుడో?

- మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్‌ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్‌ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- గడిచిన జనవరిలోనే ఉత్తర్వులను జారీ చేసిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ
- జిల్లాలో అప్‌గ్రేడ్‌ చేసిన 135 అంగన్‌వాడీ కేంద్రాలకు ఆయాల అవసరం
- ఇప్పటి వరకు నోటిఫికేషన్‌ జారీ చేయని వైనం



తాళ్లరాంపూర్‌లోని అప్‌గ్రేడ్‌ చేసిన అంగన్‌వాడీ కేంద్రంలో అన్నీ తానై విధులు నిర్వహిస్తున్న కార్యకర్త

మోర్తాడ్‌(బాల్కొండ): మెయిన్‌ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్‌ చేసిన మినీ కేంద్రాల్లో ఆయాల నియామకం చేపట్టకపోవడంతో కార్యకర్తలే అన్ని పనులు చేయాల్సి వస్తోంది. జిల్లాలో ఉన్న 135 మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్‌ కేంద్రాలుగా అప్‌గ్రేడ్‌ చేస్తూ గడిచిన జనవరిలోనే స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అప్పట్లోనే ఆయాలను నియమించడానికి నోటిఫికేషన్‌ను జారీ చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆయాల నియామకానికి చర్యలు తీసుకోకపోవడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అవస్థలు పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వేసవి సెలవులను ప్రకటించిన ప్రభుత్వం 15 రోజుల పాటు ఆయాలు, మరో పదిహేను రోజులు కార్యకర్తలు సెలవు తీసుకోవాలని సూచించింది. ఆయాలు సెలవులో ఉంటే కార్యకర్తలు, కార్యకర్తలు సెలవు తీసుకుంటే ఆయాలు అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టిక ఆహారం వండిపెట్టాల్సి ఉంటుంది. ఆయాలు ఉన్న చోట ఎలాంటి ఇబ్బంది లేదు. ఆయాలు లేని అప్‌గ్రేడ్‌ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో మాత్రం ఈసారి కార్యకర్తలకు సెలవులు లేకుండా పోయాయి. వారికి వేతనం పెరిగినా ఆయాలు లేని కారణంగా వేసవి సెలవులకు దూరమయ్యారు. కార్యకర్తలే పౌష్టిక ఆహారం వండి పెడుతున్నారు. ఆయాల పోస్టులను భర్తీ చేస్తే కొంతమంది మహిళలకైనా ఉపాధి లభిస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌ ముగిసిపోయినా ఇంకా కోడ్‌ తొలగిపోలేదు. కోడ్‌ ఎత్తివేసిన తరువాతనే ఆయాల నియామకంపై చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వం ఆయాల నియామకంపై దృష్టి సారించి ఎన్నికల కమిషన్‌ అనుమతి తీసుకుని చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నియామకంపై ఆదేశాలు రాలేదు

అప్‌గ్రేడ్‌ చేసిన మినీ అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాల నియామకంపై ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు అందలేదు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడగానే ఆయాల నియామకం పూర్తి చేస్తాం. ఈసారి మాత్రం అప్‌గ్రేడ్‌ చేసిన మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు వేసవి సెలవులు లేవని చెప్పాం. త్వరలోనే పోస్టులు భర్తీ కావచ్చు.

– రసూల్‌బీ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి

మళ్లీ విడిపోయిన తొర్తి గ్రామస్తులు

- 2021లో వరి కోత యంత్రం అద్దె విషయంలో గొడవలు
- ఆరు నెలల కిందటే ఒక్కటైన గ్రామస్తులు
- అంతలోనే మరోసారి మనస్పర్థలు.. రెండుగా చీలిన గ్రామం
- అధికారులు చొరవ చూపి ఇరువర్గాల మధ్య సయోధ్య కుదర్చాలని పలువురి విన్నపం



తొర్తి గ్రామ ముఖచిత్రం

మోర్తాడ్‌: చిన్న చిన్న మనస్పర్ధలతో మూడేళ్ల కింద రెండు వర్గాలుగా విడిపోయిన ఏర్గట్ల మండలం తొర్తి గ్రామస్తులు ఆరు నెలల కింద కలిసిపోయారు. అంతలోనే మరోసారి ఇరు వర్గాల మధ్య వివాదం ఏర్పడగా మరోసారి రెండు వర్గాలుగా చీలిపోయింది. మూడు ప్రధాన కులాల వారు ఒక వర్గం, మరో ఏడు కులాల వారు మరో వర్గంగా విడిపోయి ఎవరికి వారే అన్నట్లు ఉంటున్నారు. ఆరు నెలల కింద కలిసిపోయిన గ్రామస్తులు ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని అందరు ఆకాంక్షించారు. గతంలో విడిపోయిన సమయంలో ఒక కులంపై ఇతర కులాల వారు నమోదు చేయించిన కేసు విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మళ్లీ రెండు వర్గాలు ఏర్పడ్డాయి. ఏ వర్గంకు సంబంధించిన కిరాణం, హోటల్‌ ఆ వర్గాలకే సరుకులు విక్రయించడం, టీ, టిఫిన్‌ అందించాల్సి ఉంది. అలాగే ఇతర కులాలకు చెందిన ఆటోలలో తమ వర్గం వారు ప్రయాణం చేయకూడదని సొంతంగానే బహిష్కరణ విధించుకోవడంతో మహిళలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. తొర్తి గ్రామస్తులు రెండు వర్గాలుగా విడిపోవడం వల్ల ఎప్పుడు ఎలాంటి ఘర్షణలు తలెత్తుతాయోనని ఆందోళన చెందుతున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామస్తుల మధ్య సయోధ్య కుదర్చాలని పలువురు సూచిస్తున్నారు.

గురుకుల కళాశాలల్లో అడ్మిషన్లు

కామారెడ్డి టౌన్‌ : గిరిజన గురుకుల జూనియర్‌ కళాశాలల్లో ఇంటర్‌ ఫస్టియర్‌లో విద్యార్థులకు స్పాట్‌ అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు రిజినల్‌ కో ఆర్డినేటర్‌ సంపత్‌కుమార్‌ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 23వ తేదీన జిల్లా కేంద్రంలోని సరంపల్లి ఎక్స్‌ రోడ్‌ వద్ద కళాశాలలో బాలురకు అలాగే 25వ తేదిన మెదక్‌ జిల్లా చేగుంటలోని కళాశాలలో బాలికలకు అడ్మిషన్లు తీసుకుంటామని తెలిపారు. మెదక్‌, కామారెడ్డి, నిజామాబాద్‌ జిల్లాలకు చెందిన 2023–24లో 10వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఒరిజనల్‌ సర్టిఫికెట్లతో హాజరుకావాలని తెలిపారు.

అక్రమ పట్టాను రద్దు చేయండి



తహసీల్దార్‌ మహ్మద్‌ షబ్బీర్‌తో వాగ్వివాదానికి దిగుతున్న చిన్నాపూర్‌ గ్రామస్తులు

- తహసీల్‌ కార్యాలయం వద్ద ధర్నాకు దిగిన చిన్నాపూర్‌ గ్రామస్తులు



రాస్తారోకో చేస్తున్న చిన్నాపూర్‌ గ్రామస్తులు

మాక్లూర్‌: చిన్నాపూర్‌ తిర్మన్‌ చెరువు శిఖంలో అడవి మామిడిపల్లికి చెందిన దత్తాద్రి, ప్రణీత్‌ అనే వ్యక్తులకు రెవిన్యూ అధికారులు 3 ఎకరాల 30 గుంటల భూమి అక్రమంగా పట్టా చేసి ఇచ్చారని ఆరోపిస్తూ శుక్రవారం చిన్నాపూర్‌ గ్రామస్తులు తహసీల్‌ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులతో పాటు ఎంపీటీసీ సత్యనారయణ, సుమారు 100 మంది గ్రామస్తులు తహసీల్‌ కార్యాలయం ఎదట బైఠాయించారు. అక్రమంగా పట్టా అయిందని తెలిసి కూడా తహసీల్దార్‌ ఈ విషయమై ఫిర్యాదు చేస్తే పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నావంటూ తహసీల్దార్‌ మహ్మద్‌ షబ్బీర్‌తో వాగ్వివాదానికి దిగారు. తహసీల్దార్‌ డౌన్‌ డౌన్‌ అంటూ నినాదాలు చేస్తూ సమీపంలో ఉన్న నందిపేట రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. తిర్మన్‌ చెరువు శిఖం సర్వేనంబర్‌ 438/ఊలో 2 ఎకరాలు, 439 సర్వేనంబర్‌లో ఎకరం 30 గుంటల భూమిని గతంలో బాలాగౌడ్‌ అనే వీఆర్‌వో అడవి మామిడిపల్లి గ్రామానికి చెందిన దత్తాద్రి, ప్రణీత్‌ అనే వ్యక్తులకు అక్రమ మార్గంలో పట్టా చేయించి ఇచ్చాడని చిన్నాపూర్‌ గ్రామస్తులు ఆరోపించారు. ఈ విషయమై పలు సార్లు ఫిర్యాదు చేసినా ప్రస్తుత తహసీల్దార్‌ అక్రమార్కులకే వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ పట్టాను రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. చిన్నాపూర్‌ తిర్మన్‌ చెరువు శిఖంలో ఉన్న 3 ఎకరాల 30 గుంటల భూమి తమకు సంబంధించినదేనని అడవి మామిడిపల్లికి చెందిన దత్తాద్రి, ప్రణీత్‌లు చెబుతున్నారు. ఆ భూమికి సంబంధించిన పట్టాపాస్‌బుక్‌ తమ వద్ద ఉందన్నారు. కొందరు కావాలనే హడావిడి చేస్తున్నారని, ఈ విషయమై అన్ని ఆధారాలతో తహసీల్దార్‌ను కలిసి విన్నవిస్తామని తెలిపారు.

30 లోపు పాఠశాల పనులు పూర్తి చేయాలి

- జిల్లా అదనపు కలెక్టర్‌ అంకిత్‌

కమ్మర్‌పల్లి: అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఈ నెల 30 లోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్‌ అంకిత్‌ అధికారులను ఆదేశించారు. శుక్రవారం బషీరాబాద్‌, హాసాకొత్తూర్‌ ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులను ఆయన పరిశీలించారు. మండలంలో 18 పాఠశాలలకు గాను 17 పాఠశాలల్లో పనులు ప్రారంభమయ్యాయని ఎంపీడీవో రాజశ్రీనివాస్‌ అదనపు కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్కూల్‌ యూనిఫామ్స్‌ను జూన్‌ 12లోగా పూర్తి చేయించాలని సెర్ప్‌ ఏపీఎం కుంట గంగాధర్‌కు సూచించారు. తహసీల్దార్‌ ఆంజనేయులు, పీఆర్‌ ఏఈ శ్రీనివాసులు, ఎంపీవో సదాశివ్‌ న్నారు.



హాసాకొత్తూర్‌ పాఠశాలలో పనుల వివరాలను తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్‌

అమ్మ ఆదర్శ పాఠశాల పనుల పరిశీలన

భీమ్‌గల్‌: మండలంలోని పలు గ్రామాల్లో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను అదనపు కలెక్టర్‌ అంకిత్‌ శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాట్లను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో సంతోష్‌ కుమార్‌, ఏఈ మేఘన, తదితరులు పాల్గొన్నారు.

వివాహిత కిడ్నాప్‌ కలకలం

ఎడపల్లి(బోధన్‌): జైతాపూర్‌ గ్రామానికి చెందిన ఓ వివాహిత కిడ్నాప్‌ కలకలం రేగింది. వివరాలు.. గ్రామానికి చెందిన ఓ వివాహితను ఆమె మేన మామ కిడ్నాప్‌ చేసి తీసుకెళ్లిన్నట్లు భర్త ఫిర్యాదు చేశారు. బ్రాహ్మణపల్లికి చెందిన మహిళకు జైతాపూర్‌కు చెందిన వ్యక్తితో నెలన్నర క్రితం వివాహం జరిగింది. శుక్రవారం వివాహిత పుస్తకాల కోసం మండలంలోని ఎంఎస్‌ ఫారం గ్రామానికి వెళ్లింది. పుస్తకాలకు వెళ్లిన వివాహిత అక్కడి నుంచి కిడ్నాప్‌ చేసినట్లు భర్త ఆరోపించారు.

భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీచందర్‌ రెడ్డి తెలిపారు. కిడ్నాప్‌ గల కారణాలు పోలీసులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

ఊపందుకున్న ఖరీఫ్‌ పనులు

- బోధన్‌ నియోజకవర్గంలో..
- విత్తనాలు, ఎరువుల కొనుగోలులో రైతులు నిమగ్నం
- వాతావరణం చల్లబడటంతో దుక్కులు, వరి నారు సిద్ధం చేస్తున్న కర్షకులు



బోధన్‌ మండలం బర్దిపూర్‌లో వేసిన వరినారు



లంగ్డాపూర్‌లో వరినారు కోసం వడ్లను అలుకుతున్న రైతులు



ఎరాజ్‌పల్లిలో సిద్ధం చేసిన పొలం

బోధన్‌రూరల్‌(బోధన్‌): బోధన్‌ నియోజకవర్గంలోని ఎడపల్లి, రెంజల్‌, నవీపేట, బోధన్‌, సాలూర మండలాల్లో వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సన్నద్ధమయ్యారు. వాతావరణం చల్లబడి చిన్నపాటి వర్షాలు కురుస్తుండటంతో ఖరీఫ్‌ పనులు ఊపందుకున్నాయి. ఈ ఏడాది వానాకాలంలో వర్షాలు సాధారణం కంటే అధికంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతుండటంతో అన్నదాతలు రెట్టింపు ఉత్సాహంతో వానాకాలం పంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం రైతులు తమ పొలాలను దుక్కులు దున్నడం, పశువుల ఎరువులను తెచ్చుకుని చల్లడం, వరి నారుమడులను సిద్ధం చేయడం వంటి పనులల్లో నిమగ్నమయ్యారు. కొంచెం ముందుగానే పనులు ప్రారంభించిన రైతులు ఇప్పటికే వరి నారును సిద్ధం చేసుకుని పొలాలను దమ్ములు చేస్తున్నారు. కరెంట్‌ బోరుబావులు, కాలువలు, చెరువుల ద్వారా సాగునీరు లభ్యత ఉన్న రైతులు వరి పంట సాగుకు ఆసక్తి కనబరుస్తుండగా నీటి సౌలభ్యత తక్కువగా ఉన్న రైతులు సోయా, పత్తి, కంది, పెసర్లు, మినుము వంటి ఆరుపడి పంటల సాగుపై దృష్టి సారించారు.

లక్షా 7 వేల ఎకరాల్లో సాగు..

బోధన్‌ వ్యవసాయ శాఖ డివిజన్‌ పరిధిలోని బోధన్‌, సాలూర, రెంజల్‌, ఎడపల్లి, నవీపేట మండలాల్లో మొత్తం లక్షా 10 వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా ఈ వానాకాలం సీజన్‌లో 1 లక్షా 7 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. ఇందులో పామ్‌ అయిల్‌, ఉద్యాన పంటలు 3 వేల ఎకరాల్లో సాగు అవుతుండగా ఈ వానాకాలం సీజన్‌లో అత్యధికంగా 86,029 ఎకరాల్లో వరి పంట, 20,249 ఎకరాల్లో సోయా, 408 ఎకరాల్లో పత్తి, 392 ఎకరాల్లో కంది, 149 ఎకరాల్లో మినుము, 76 ఎకరాల్లో పెసర్లు, 40 ఎకరాల్లో మొక్క జొన్న పంటలను రైతులు సాగు చేసే అవకాశం ఉన్నట్లు బోధన్‌ ఇంచార్జి ఏడీఏ సంతోష్‌ తెలిపారు. ఇందుకు అనుగుణంగా వ్యవసాయ శాఖ అధికారులు 18,065 మెట్రిక్‌ టన్నుల యూరియా, 6,014 మెట్రిక్‌ టన్నుల కాంప్లెక్స్‌ ఎరువులు రైతులకు అవసరం ఉన్నట్లు అంచనా వేసినట్లు, రైతుల అవసరం మేరకు ఎరువులను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ, బోధన్‌ డివిజన్‌కు 800 క్వింటాల జీలుగను కేటాయించి ప్రస్తుతం రైతులకు 50 శాతం సబ్సిడీతో ఎంపిక చేసిన సొసైటీల ద్వారా అందిస్తున్నారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పిస్తూ రైతులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని, సకాలంలో రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం ప్రభుత్వం అందించి అండగా నిలవాలని అన్నదాతలు కోరుతున్నారు.

పదెకరాల్లో వరి సాగు చేస్తున్నాం



మా సొంత పొలం 3 ఎకరాలతో పాటు 7 ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని 10 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్నాం. వాతావరణం చల్లబడటంతో దుక్కులు దున్ని వరి నారును సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వం ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచి సకాలంలో రైతు భరోసా ద్వారా పెట్టుబడి సాయం అందించి అండగా నిలవాలని కోరుతున్నాం.

– సాయి కిరణ్‌, రైతు, లంగ్డాపూర్‌, బోధన్‌

సూచనలు పాటించాలి



అన్నదాతలు వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలి. రైతులకు 50 శాతం సబ్సిడీతో జీలుగ విత్తనాలు అందిస్తున్నాం. రైతుల అవసరం మేరకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతాం. ఏఈవోలు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉంటూ తక్కువ పెట్టుబడితో అధిక లాభాల సాధించేలా అండగా నిలవాలి.

– సంతోష్‌, ఇన్‌చార్జి ఏడీఏ, బోధన్‌

ఇసుక టిప్పర్‌ సీజ్‌



సాక్షి ఎఫెక్ట్‌..

మద్నూర్‌(జుక్కల్‌): డోంగ్లీ మండలం కుర్లా సమీపంలోని మంజీర వాగు నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను శుక్రవారం ఎస్సై శ్రీకాంత్‌ పట్టుకొని సీజ్‌ చేశారు. ఈ నెల 15న సాక్షి దిన పత్రికలో వచ్చిన 'మంజీరాలో ఇసుకాసురులు' అనే కథనానికి పోలీసులు స్పందించారు. కుర్లా సమీపంలోని మంజీర నుంచి అక్రమంగా ఇసుకను తోడి టిప్పర్‌లో తరలిస్తుండగా మేనూర్‌ శివారులో పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. కర్ణాటకకు చెందిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. మంజీర వాగు లోంచి ఎవరైనా అక్రమంగా ఇసుకను కరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఐ ఫోన్‌ రూ.499కే వస్తుందని ఆశపడి..

- ఆన్‌లైన్‌లో మోసపోయిన బాధితుడు

కమ్మర్‌పల్లి: ప్రముఖ టెక్‌ దిగ్గజం ఆపిల్‌ కంపెనీ ఐ ఫోన్‌ తక్కువ ధరకే వస్తుందనే ఆశతో డబ్బులు పంపి మోసపోయిన యువకుడి ఘటన కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన పవార్‌ బన్నీ మార్చి 30న రూ. 499కే ఆపిల్‌ కంపెనీకి చెందిన ఐ ఫోన్‌ లభిస్తుందని సామాజిక మాధ్యమం ఇన్‌స్టాగ్రాంలో ప్రకటన చూశాడు. ప్రకటనపై క్లిక్‌ చేయండంతో అవతలి వైపు నుంచి అపరిచిత వ్యక్తి ఆన్‌లైన్‌లోకి వచ్చి చాటింగ్‌ మొదలు పెట్టాడు. చాటింగ్‌లో ఐ ఫోన్‌ కావాలంటే కొంత డబ్బు పంపాలని సూచించాడు. దీంతో ఆయన మాటలు నమ్మి బన్నీ ఫామ్‌ యాప్‌ నుంచి అపరిచితుడు పంపిన యూపీఐ స్కానర్‌ ద్వారా రూ.499 పంపాడు. తర్వాత డెలివరీ, షిప్పింగ్‌, వెయిటింగ్‌ ఛార్జీలు పంపమన్నాడు. ఏప్రిల్‌ 8న మళ్లీ అదే యాప్‌ నుంచి రూ.2,200 పంపాడు. తన తండ్రి బాలాజీ గూగుల్‌ పే నుంచి రూ. 3,999, మరుసటి రోజు రూ.6,999 పంపాడు. అదే రోజు ఆధార్‌ క్యాష్‌ కౌంటర్‌కు వెళ్లి ఆన్‌లైన్‌ ద్వారా రూ. 9,999 పంపాడు. ఇలా మొత్తం రూ.23,696 పంపినా ఐ ఫోన్‌ పంపలేదు. పైగా మళ్లీ కొంత డబ్బును పంపాలని చెప్పగా, మోసపోయినట్లు గుర్తించిన బన్నీ 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌ చేసి సైబర్‌ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

క్రైం కార్నర్‌

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సిద్ధరాములు(ఫైల్‌)

రాజంపేట: చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన ఆర్గోండలో చోటు చేసుకుంది. ఎస్సై, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సిద్ధ రాములు(40) వృత్తి రీత్యా డ్రైవర్‌. గత శనివారం అర్ధరాత్రి ఆర్గోండ శివారులో అదే గ్రామానికి చెందిన కుమ్మరి సత్తవ్వను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ప్రమాదానికి చాకలి సిద్ధరాములే కారణమై ఉంటాడని గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు అనుమానం వ్యక్తం చేసి, అందుకు పరిహారం చెల్లించాలని ఆయనపై ఒత్తిడి చేశారు. దీంతో నాలుగు రోజులుగా మదన పడుతున్న చాకలి సిద్ధరాములు గురువారం రాత్రి ఎల్లారెడ్డిపల్లి శివారులోని అడవిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కొందరు గ్రామస్తులు ఈ మృతికి కారణమై ఉంటారని కుటుంబ సభ్యుల అనుమానం వ్యక్తం చేస్తున్నారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్సై సంపత్‌ తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపినందుకు జైలు శిక్ష

ఖలీల్‌వాడి: మద్యం తాగి వాహనం నడిపిన ఒకరికి జైలు శిక్ష విధించగా మరో తొమ్మిది మందికి జరిమానా విధించినట్లు ఏసీపీ నారాయణ తెలిపారు. శుక్రవారం పది మందికి నగరంలోని ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్‌ నిర్వహించిన అనంతరం కోర్టులో హాజరుపర్చారు. 9 మందికి రూ.16 వేలు జరిమానా విధించగా మరొకరికి 12 రోజుల జైలు శిక్ష విధించినట్లు ఏసీపీ తెలిపారు.

కుళ్లినస్థితిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి మండలంలోని చిన్నమల్లారెడ్డి శివారులో కుళ్లినస్థితిలో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం ఉన్నట్లు స్థానికులు పోలీసులకు శుక్రవారం సమాచారం అందించారు. ఈ మేరకు ఎస్సై రాజు ఘటనాస్థలాన్ని చేరుకొని విచారణ చేపట్టారు. మృతుడి వయస్సు 50 నుంచి 60 ఏళ్లు ఉంటుందని, వారం రోజుల క్రితం మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. కుడి చేతి వేలికి రాగి ఉంగం, మెడలో తాయత్తు తప్ప ఇతర ఆనవాళ్లు దొరకలేదన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

రోగి మృతి.. బంధువుల ఆందోళన

నిజామాబాద్‌నాగారం: నగరంలోని ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో ఉన్న ఓ ప్రైవేట్‌ ఆస్పత్రిలో రోగి మృతి చెందడంతో శుక్రవారం బంధువులు ఆందోళనకు దిగారు. వివరాలు.. నవీపేట మండలం నిజాంపూర్‌ గ్రామానికి చెందిన పట్టి నారాయణ(36) అనే వ్యక్తి గుండె నొప్పితో ప్రైవేట్‌ ఆస్పత్రిలో వారం రోజుల క్రితం చేరారు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించదని చెప్పి రూ.80 వేలు ఆస్పత్రి యాజమాన్యం కట్టించుకుంది. ఆపరేషన్‌ విజయవంతంగా పూర్తి చేశామని వైద్యులు కూడా చెప్పారు. నారాయణను చూపించకపోవడంతో అనుమానం వచ్చి బంధువులు యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చారు. చివరకు నారాయణ చనిపోయినా కూడా తమకేమీ సంబంధం లేనట్లు కట్టు కథ నడిపించారు. న్యాయం చేయాలని కుటుంబీకులు ధర్నా చేసినా పట్టించుకోలేదు. పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించి ప్రైవేట్‌ అంబులెన్స్‌లో మృతదేహాన్ని తరలించారు. కుటుంబ సభ్యులు ఆస్పత్రి నుంచి సీపీ కార్యాలయానికి ర్యాలీగా వెళ్లి విన్నవించారు.



ప్రైవేట్‌ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు